మన రాష్ట్రం దేశానికే రోల్ మోడల్

సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు


ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు, డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి

పాయకాపురం(విజయవాడరూరల్): ప్రజలందరికీ సంతృప్తస్థాయిలో సంక్షేమ పథకాలు అందించడమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. బుధవారం 63వ డివిజన్ 279వ వార్డు సచివాలయ పరిధిలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. కార్యక్రమంలో నగర డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి, స్థానిక కార్పొరేటర్ మోదుగుల తిరుపతమ్మతో కలిసి మల్లాది విష్ణు పాల్గొన్నారు. ఉడా కాలనీలో విస్తృతంగా పర్యటించి 240 గడపలను సందర్శించారు. ప్రతి ఒక్కరినీ పేరు పేరున పలకరిస్తూ అన్ని శాఖల అధికారులతో కలిసి వినతులు స్వీకరించారు.

బహుముఖంగా పనిచేస్తున్న ప్రభుత్వమిది..


సంక్షేమంతో పాటు అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యతనిస్తూ ఈ ప్రభుత్వం బహుముఖంగా పనిచేస్తోందని ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. నాలుగేళ్లలో డివిజన్లో రూ. 12 కోట్ల మేర అభివృద్ధి పనులు చేపట్టడమే ఇందుకు నిదర్శనమన్నారు. ప్రధానంగా 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1.25 కోట్లతో హోసన్నా మందిరం రోడ్డు, మరో రూ. 1.20 కోట్లతో డాక్టర్స్ కాలనీ రోడ్లను పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. వర్షాకాలంలో ఏ ఒక్క వీధిలోనూ నీరు నిలిచిపోకుండా రాజీవ్‌నగర్ నుంచి కండ్రిక డీపీ స్టేషన్ వరకు రూ. 3.50 కోట్లతో డ్రెయిన్ల నిర్మాణానికి టెండర్లు పిలిచామన్నారు. వీలైనంత త్వరగా పనులు ప్రారంభిస్తామని తెలిపారు. రూ. 14 లక్షలతో తెలుగుతల్లి పార్కును సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దినట్లు వెల్లడించారు. అదే విధంగా 5 సచివాలయాల పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా విడుదలైన రూ. కోటి నిధులతో అనేక రోడ్లకు మోక్షం లభించిందన్నారు. మరో వైపు డీఎంఎఫ్‌టీ ఫండ్ రూ.2.70 కోట్లతో ఉడాకాలనీ నుంచి కండ్రిక వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి టెండర్లను పిలవనున్నట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో డీఈ రామకృష్ణ, ఆర్ఐ శరత్, సీడీఓ జగదీశ్వరి, నాయకులు పసుపులేటి ఏసు, మోదుగుల గణేష్, సీహెచ్ రవి, టిక్కం కృష్ణ, తిరుపతిరావు, అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రబాబుది నాలుగు నాలుకల ధోరణి

పొత్తులపై టీడీపీ నేత చంద్రబాబు ది నాలుగు నాలుకల ధోరణి అని ఎమ్మెల్యే మల్లాది విష్ణు విమర్శించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం అనంతరం ఆయన విలేఖరులతో మాట్లాడారు. ప్రతిపక్ష నేతకు పొత్తులపై ఉన్న శ్రద్ధ, ప్రజలపై ఏ మాత్రం లేదని, బాబు రాజకీయ జీవితమే పొత్తులమయమని ఎద్దేవా చేశారు. ఓటమి భయం ఉన్న పార్టీలే పొత్తుల కోసం పాకులాడుతాయని, రాబోయే ఎన్నికలలో వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ సింగిల్ గానే పోటీ చేస్తుందని స్పష్టం చేశారు.

స్పోర్ట్స్ కోటా నియామకాలు, అడ్మిషన్లపై విచారణ చేపట్టాలి

ఏపీ అత్యా పాత్యా సీఈఓ రంభాప్రసాద్


అత్యా పాత్యా రాష్ట్ర సీఈఓ రంభప్రసాద్

లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్రంలో స్పోర్ట్స్ కోటాలో జరిగిన గ్రూప్ 1, గ్రూప్ 2 నియామకాలపై విచారణ జరిపించాలని ఆంధ్రప్రదేశ్ అత్యా పాత్యా సీఈఓ. రంభప్రసాద్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కోరారు. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్పోర్ట్స్ కోటాలో అడ్మిషన్‌లు పొందిన ఎంబీబీఎస్ విద్యార్థుల వివరాలు తెలియజేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ విషయమై స్పోర్ట్స్ అథారిటీని కోరినా కనీసం స్పందన లేదన్నారు. అలాంటి అధికారులపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఉద్యోగ నియామకాలు, మెడికల్ అడ్మిషన్ల సమయంలో స్పోర్ట్స్ సర్టిఫికెట్‌లు వెరిఫికేషన్ చేసిన అధికారిపై విచారణ చేపట్టాలని తెలిపారు. తెలంగాణలో స్పోర్ట్స్ కోటాలో జరుగుతున్న అవకతవకలపై ప్రభుత్వం స్పందించిందని, ఆంధ్రప్రదేశ్‌లోనూ ప్రభుత్వం స్పందించి స్పోర్ట్స్ కోటాలో జరిగిన అవకతవకలను నియంత్రించి నిజమైన క్రీడాకారులను న్యాయం చేయాలని విన్నవించారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ జమలపూర్ణమ్మ


శంకుస్థాపన చేస్తున్న గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ టీజే పూర్ణమ్మ

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, విజ్ఞాన సముపార్జన కోసం సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ టీజే పూర్ణమ్మ తెలిపారు. సత్యనారాయణపురంలోని చిత్తరంజన్ గ్రంథాలయంలో నూతనంగా నిర్మాణం చేపట్టిన అదనపు ఫ్లోర్‌లో సదుపాయలకు బుధవారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జమలపూర్ణమ్మ మాట్లాడుతూ విద్యార్థులు తరగతి గదిలో పాఠ్య పుస్తకాలను చదవటం వలన అందులోని సారాంశం మాత్రమే తెలుస్తుందని చెప్పారు. గ్రంథాలయాల్లో లభ్యమయ్యే వివిధ వార్త పత్రికలు, ప్రాచీన గ్రంథాలు, దేశ చరిత్రలు, స్వాతంత్ర్య సమరయోధుల చరిత్రలు తెలుసుకోవడం ద్వారా విజ్ఞానం పెరుగుతుందన్నారు. విద్యార్థి దశ నుంచే గ్రంథాలయాలపై మక్కువ పెరిగేలా చదవడం మాకిష్టం, గ్రంథాలయ వారోత్సవాల పేరుతో అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. కాంపిటేటివ్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు అవసరమైన అన్ని పుస్తకాలు, స్టడీ మెటీరియల్స్‌ను గ్రంథాలయాల్లో అందుబాటులో ఉంచుతున్నామని పేర్కొన్నారు. చక్కటి వాతావరణంలో చదువుకోటానికి కావాల్సిన అన్ని మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అందులో భాగంగానే చిత్తరంజన్ గ్రంథాలయంలో అదనపు ఫ్లోర్ నిర్మాణం చేపట్టడంతో పాటు రూ. 9 లక్షల నిధులు మంజూరు చేసి పాఠకులకు అవసరమైన సదుపాయాల ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి పి.సంపత్‌కుమార్, రికార్డ్ అసిస్టెంట్ ప్రణీత, శ్రీనివాస్, పూర్ణ, పాఠకులు పాల్గొన్నారు.

కృష్ణాష్టమి వేడుకల ఆహ్వాన పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే విష్ణు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో సెప్టెంబర్ 6వ తేదీన పాయకాపురంలో జరగనున్న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల పోస్టర్‌లను ఎమ్మెల్యే మల్లాది విష్ణు సింగ్‌నగర్ ఆంధ్రప్రభకాలనీలోని తన కార్యాలయంలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ శ్రీకృష్ణ పరమాత్ముని జన్మదిన వేడుకలను సెప్టెంబర్ 6 నుంచి 13వ తేదీ వరకూ ఎనిమిది రోజుల పాటు నిర్వహించనున్నారని, భక్తులంతా ఈ వేడుకల్లో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంతం-ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక విజయవాడ కమిటీ అధ్యక్షుడు సురేష్, సభ్యులు తిరుపతి, సత్యం, అప్పల నరసమ్మ, లక్ష్మీ,దుర్గారావు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సంగీతోత్సవాలు

విజయవాడ కల్చరల్: లయనాద కళా ప్రవంతి ఆధ్వర్యంలో దుర్గాపురంలోని శివరామకృష్ణ క్షేత్రంలో నిర్వహిస్తున్న సంగీత విద్వాంసుడు లంకా వెంకటేశ్వర్లు సంస్మరణ సంగీత మహోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. బుధవారం నాటి కార్యక్రమంలో వాగ్గేయకార కీర్తనలను ప్రముఖ సంగీత విద్వాంసురాలు బి. గిరిజా భవాని, కుందుర్తి మాధవి, యువ సంగీత కళాకారులు ఆర్. వైష్ణవి, ఎం. కీర్తన, తదితరులు కీర్తనలను ఆలపించారు. చివరిగా వీణ విద్వాంసుడు కె. శిఖర్ వాగ్గేయకార కీర్తనలను పలికించారు. అరవింద్ ఇఖానన్, కేపీ కిషోర్, ఆదినారాయణ వాయిద్య సహకారం అందించారు.

రేపటి కార్యక్రమాలు..

సాయంత్రం 6 గంటలకు ప్రారంభమవుతాయి. అనిల్‌కుమార్, వారిజలోచన, దల్లా గాయత్రి, జి. అన్నపూర్ణ, కొల్లూరి వందనల గాత్ర సంగీత కార్యక్రమాలుంటాయని సంస్థ ప్రధాన కార్యదర్శి కుందుర్తి మాధవి తెలిపారు.

ప్రతిధ్వనించిన సంగీత ఝురులు



కీర్తనలు ఆలపిస్తున్న కళాకారులు


గరగ నృత్యం చేస్తున్న కళాకారులు

ముగిసిన సంగీత సంధ్య మహోత్సవాలు

విజయవాడ కల్చరల్: అక్కడ సంగీత ఝురులు ప్రతిధ్వనించాయి. సుసర్వసంగీత ధ్వనికి ప్రకృతి పులకించి పోయింది. సంగీత కుటుంబమే వసుధైకం కావడంతో ప్రేక్షకులు మురిసిపోయారు . ప్రసారభారతి, విజయవాడ ఆకాశవాణి కేంద్రం ఆధ్వర్యంలో జీ 20 వసుధైక కుటుంబం కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న సంగీత సంధ్య కార్యక్రమం మొగల్రాజపురంలోనిపీబీ సిద్ధార్థ కళాశాలలో బుధవారం ముగిసింది. విజయవాడ ఆకాశవాణి కేంద్రంలో నిలయ విద్వాంసురాలిగా పనిచేస్తున్న విష్ణుభొట్ల సరస్వతి వాగ్గేకారులు రచించిన దేవదేవం భజే, పలుకే బంగారమాయనా, భాగ్యలక్ష్మి వార్తమ్మ కీర్తనను ఆలపించారు. రెండవ కార్యక్రమంగా ఆకాశవాణి టాప్ గ్రేడ్ ఆర్టిస్టులు సంగీత కుటుంబానికి చెందిన మల్లాది శ్రీరాం ప్రసాద్ విశ్వనాథశాస్త్రి దేశ భక్తి గీతాలను, మల్లాది శ్రీరాం ప్రసాద్ లలిత గీతాలను ఆలపించారు. విజయవాడ ఆకాశవాణి కేంద్రం నిలయ విద్వాంసులు బీవీ దుర్గాభవాని వయోలిన్‌పై సద్గురుచరణ్, బీవీఎస్ ప్రసాద్ మృదంగంపై సహకరించారు. చివరిగా తునికి చెందిన కేవైపీ ప్రసాద్ బృందం సంప్రదాయ గరగ నృత్యాన్ని మనోహరంగా ప్రదర్శించారు. విజయవాడ ఆకాశవాణి కేంద్రం హెడ్ సోమేశ్వరరావు, ప్రోగ్రామ్ హెడ్ జె.శైలజ నిర్వహించారు. కార్యక్రమంలో అధికారభాషా సంఘం చైర్మన్ పి.విజయబాబు, ప్రపంచ తెలుగు రచయితల సంఘం గౌరవ అధ్యక్షుడు మండలి బుద్ధప్రసాద్, ఆకాశవాణి విశ్రాంత అనౌన్సర్ బీ జయప్రకాష్, సంగీత విద్యాంసుడు గౌరీనాథ్ పాల్గొన్నారు.

రెండో విడత కౌన్సెలింగ్‌లో జీవో 151 నిబంధనలు అమలు చేయాలి

హెల్త్ యూనివర్సిటీ వీసీకి బీసీ సంఘాల నేతలు వినతి

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రభుత్వం హైకోర్టు ఆదేశాల మేరకు 2020లో విడుదల చేసిన జీవో 151 నిబంధనలను వైద్య విద్య ప్రవేశాల రెండో విడత కౌన్సెలింగ్ లోనూ అమలు చేయాలని బీసీ సంక్షేమ సంఘం నేతలు బుధవారం డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వ విద్యాలయం ఉపకులపతి డాక్టర్ కె.బాబ్జిని కలిసి వినతిపత్రం అందజేశారు. వైద్య విద్య ప్రవేశాల్లో పారదర్శకత కోసం ప్రభుత్వం 151 జీవో విడుదల చేసినట్లు పేర్కొన్నారు. అయితే రెండో విడతలో ఆ నిబంధనలు పాటించకపోవడం వల్ల రిజర్వేషన్ కేటగిరి విద్యార్థులు సీట్లు కోల్పోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. తక్కువ మార్కులు పొందిన అభ్యర్థులకు ఓపెన్ కేటగిరిలో, ఎక్కువ మార్కులు పొందిన అభ్యర్థులకు రిజర్వేషన్ కేటగిరిలో ఎంబీబీఎస్ సీట్లు కేటాయించడాన్ని అరికట్టాలని వీసీ డాక్టర్ కె.బాబ్జిని కోరినట్లు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు తెలిపారు. యూనివర్సిటీ అధికారులు రెండో విడత కౌన్సిలింగ్‌లో ప్రభుత్వ జీవోలను సక్రమంగా అమలు చేయాలని వారు కోరారు. వీసీని కలిసిన వారిలో మెడికోస్ పేరెంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ అలా వెంకటేశ్వర్లు, బీసీ రాష్ట్ర నాయకులు కొలనుకొండ శివాజీ తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యేకు రాఖీ కట్టిన మేయర్


ఎమ్మెల్యే విష్ణుకు రాఖీలు కడుతున్న మేయర్ భాగ్యలక్ష్మి, కార్పొరేటర్లు


చేయూత మానసిక వికలాంగుల శిక్షణ సంస్థ కార్యాలయంలో రాఖీ వేడుకలు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సింగ్ నగర్ ఆంధ్రప్రభ కాలనీలోని జనహిత సదనంలో రాఖీ పౌర్ణమి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యులు మల్లాది విష్ణుకు పలువురు మహిళా ప్రజాప్రతినిధులు రాఖీలు కట్టి ఆయనపై వారికున్న అభిమానాన్ని చాటారు. నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, వైఎస్సార్‌సీపీ మహిళ కార్పొరేటర్లు ఇసరపు దేవి, కొండాయిగుంట మల్లేశ్వరి, యరగొర్ల తిరుపతమ్మ, ఎండీ షాహినా సుల్తానా, మోదుగుల తిరుపతమ్మ, ఉమ్మడి రమాదేవి ఎమ్మెల్యే కార్యాలయానికి విచ్చేసి ఆయనకు రాఖీలు కట్టి, రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ ఆ దుర్గమ్మ చల్లని దీవెనలు అక్కచెల్లెమ్మలపై ఎల్లవేళలా ఉండాలని ఆయన ఆకాంక్షించారు.

ఎమ్మెల్యేకు రాఖీ కట్టిన ఆడపడుచులు

పాయకాపురం(విజయవాడరూరల్): రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని అక్కచెల్లెమ్మలకు ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు శుభాకాంక్షలు తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా బుధవారం రాజీవ్ నగర్లోని ఉడాకాలనీలో పర్యటించిన ఎమ్మెల్యేకి మహిళలందరూ సాదర స్వాగతం పలికారు. అనంతరం డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి, స్థానిక కార్పొరేటర్ మోదుగుల తిరుపతమ్మ, స్థానిక మహిళలతో కలిసి రాఖీ కట్టారు.

ప్రత్యేక చిన్నారుల రాఖీ సందడి

మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్ లోటస్ ల్యాండ్ మార్క్‌లోని చేయూత మానసిక వికలాంగుల శిక్షణ సంస్థ కార్యాలయంలో బుధవారం రాఖీ పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రత్యేక చిన్నారులు తమ సోదరులకు పూజ చేసి రాఖీ కట్టి మిఠాయిలు తినిపించారు. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ డాక్టర్ టి. కృష్ణకుమారి మాట్లాడుతూ ప్రత్యేక చిన్నారులు సోదరులతో ఎలా మెలగాలో తెలియ చేయటంతో పాటు సంస్కృతి సంప్రదాయాలను తెలియజేసేందుకు రాఖీ పౌర్ణమి వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులు రాఖీ వేడుకలలో ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రత్యేక చిన్నారుల తల్లిదండ్రులు, చేయూత మానసిక వికలాంగుల శిక్షణ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

తుది ఓటర్ల జాబితా ప్రచురణకు సహకరించాలి

కలెక్టర్ ఢిల్లీరావు


మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): స్పష్టమైన తుది ఓటర్ల జాబితా ప్రచురణకు రాజకీయ పక్షాలు పూర్తి సహకారం అందించాలని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు కోరారు. కలెక్టరేట్‌లో ప్రత్యేక సంక్షిప్త సవరణ 2024లో భాగంగా రాజకీయపార్టీల ప్రతినిధులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఢిల్లీరావు మాట్లాడుతూ అందరి సహకారంతో జిల్లాలో ఓటర్ల జాబితా ఇంటింటి పరిశీలన విజయవంతమైందని చెప్పారు. పరిశీలనలో భాగంగా సేకరించిన సమాచారాన్ని వెబ్ సైట్‌లో అప్‌లోడ్ చేసే ప్రక్రియ జరుగుతోందని తెలిపారు. 2024 జనవరి 5న తుది ఓటర్ల జాబితా ప్రచురిస్తామని పేర్కొన్నారు. జాబితా ప్రచురణ ప్రక్రియ అన్ని స్థాయిల్లోని రాజకీయపార్టీలకు ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తామన్నారు. సమావేశంలో డీఆర్వో కె. మోహన్ కుమార్,కలెక్టరేట్ ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ సిహెచ్ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సర్వమానవాళి క్షేమాన్ని కోరుతూ దువా


ప్రత్యేక దువా చేస్తున్న ఎమ్మెల్సీ రుహుల్లా, అల్తాఫ్ బాబా

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సర్వమానవాళి క్షేమాన్ని కాంక్షిస్తూ సింగ్‌నగర్ డాబాకొట్లు సెంటర్‌లోని ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా కార్యాలయంలో బుధవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కొండపల్లి బీ కాలనీలోని హజరత్ షాబుఖారి బాబా దర్గా ప్రతినిధి అల్తాఫ్ బాబా, పలువురు ముస్లిం మత పెద్దలు కలిసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యం కోసం, రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావాలని, సర్వమానవాళి సంక్షేమాన్ని ఆకాంక్షిస్తూ అల్లాహ్‌కు ప్రత్యేక దువా చేశారు. అనంతరం అల్తాఫ్ బాబాను, ముస్లిం పెద్దలను ఎమ్మెల్సీ రుహుల్లా శాలువాలు కప్పి సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ముస్లిం మైనార్టీ నాయకులు ఎండీ హఫీజుల్లా, రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ డైరెక్టర్ షేక్ ఖాజ, అమిత్, ముస్నీ పాల్గొన్నారు.

విజయవాడ నుంచి కాకినాడకు నూతన సర్వీస్

పూర్ణానందంపేట(విజయవాడపశ్చిమ): విజయవాడ నుంచి కాకినాడకు కొత్త రూట్‌లో (అల్ట్రా డీలక్స్ బస్)ను ప్రవేశపెట్టినట్లు గవర్నర్ పేట-1 ఆర్టీసీ డిపో మేనేజర్ కె.బసవయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ నుంచి మచిలీపట్నం, బంటుమిల్లి, నరసాపురం, రాజోలు, అమలాపురం, యానాం మీదుగా కాకినాడకు వెళుతుందని పేర్కొన్నారు. ఈ మార్గంలో వెళ్లే ప్రయాణికులు ఈ నూతన సర్వీస్ సౌకర్యాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. ఈ బస్ విజయవాడలో ఉదయం 6.30 గంటలకు బయలుదేరి నరసాపురానికి 10.30 గంటలకు చేరుకుని, అమలాపురం 12 గంటలకు, మధ్యాహ్నం 1.55 గంటలకు కాకినాడ చేరుకుంటుందని తెలిపారు.

అలాగే ఈ బస్ కాకినాడలో సాయంత్రం 4.45 గంటలకు బయలుదేరి అమలాపురం 18.30 గంటలకు, నరసాపురానికి 20.05 గంటలకు చేరుకుని రాత్రి 12.15 గంటలకు విజయవాడ చేరుకుంటుందన్నారు. రిజర్వేషన్ సౌకర్యం ఉందని, ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గాంధీనగర్ సెక్షన్ అలంకార్ సెంటర్ సబ్ స్టేషన్ 11 కేవీ జింఖానా ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతులు, నిర్వహణ పనుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ విజయవాడ టౌన్ డివిజన్ ఈఈ బీవీ సుధాకర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పాల బజారు, ఫిల్మ్ గోడౌన్ రోడ్, నాడార్ వీధి, పీటర్ వీధి, ఖాసీం వీధి, డేవిడ్ వీధి, అల్లావుద్దీన్ వీధి, ఆర్‌సీఎం చర్చ్ వీధి, వంగా సుందర రావు వీధి, హోర్డ్ పేట, వినుకొండ వారి వీధి, కత్తి రామయ్య వీధి, సీకే రెడ్డి రోడ్ ఏరియాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

ముత్యాలంపాడు సెక్షన్‌లో..

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు సెక్షన్ అయోధ్య నగర్, రామలింగేశ్వర పేట ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా గురువారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈఈ బీవీ సుధాకర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. లోటస్ సెక్టార్-3లో రోడ్ నంబర్-1లో గల ఆస్మా అపార్ట్‌మెంట్ , సెక్టార్ -4 లో ఆంధ్ర బ్యాంక్ అపార్ట్‌మెంట్ , బ్లూ ఫ్లవర్ హాస్పిటల్ బిల్డింగ్, అక్షయ రెసిడెన్సి, దారాస్ బిల్డింగ్, జేఆర్ఆర్ కాంప్లెక్స్, సీకే రెడ్డి రోడ్‌లో పెట్రోల్ బంక్, నెక్సా షోరూం, వే బ్రిడ్జి, రామలింగేశ్వరపేట మెయిన్ రోడ్, అయోధ్య టవర్స్ రామలింగేశ్వర పేట ఫస్ట్ లైను, మోతీ ఎంక్లేవ్ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఆయా ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

అధికార పత్రాలలో తెలుగును వినియోగించాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): గిడుగు రామ్మూర్తి పంతులు జయంతిని రాష్ట్ర ప్రభుత్వం తెలుగు భాషా దినోత్సవంగా ప్రకటించటం అభినందనీయమని బుధవారం అల్లూరి సీతారామరాజు స్మారక గ్రంథాలయం, సాంస్కృతిక సంఘం అధ్యక్షుడు కె. సుబ్బరాజు, ఎస్. వెంకటేశ్వరరాజు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం అధికార పత్రాలలో తెలుగు భాషను వినియోగించాలని సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. అలాగే హైకోర్టులలో తెలుగు భాషలో తీర్పులు వెలువడాలంటూ పత్రికాముఖంగా హైకోర్టు న్యాయమూర్తికి విజ్ఞప్తి చేశారు.

ప్రారంభమైన సంతోషిమాత జయంత్యుత్సవాలు

పాయకాపురం(విజయవాడరూరల్): పాయకాపురంలో కొలువైన సంతోషిమాత అమ్మవారి 28వ జయంత్యుత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ కమిటీ అధ్యక్షుడు చిన్ని చిట్టిబాబు నేతృత్వంలో కమిటీ పెద్దల పర్యవేక్షణలో ప్రారంభమైన ఈ ఉత్సవాల్లో తొలి రోజున అమ్మవారికి పంచామృతాభిషేకం, విశేషాలంకరణ, లక్ష్మీగణపతి హోమం, కుంకుమ పూజ, స్వామీజీలకు సత్కారం, ప్రవచనాలు, మహా నైవేద్యం కార్యక్రమాలు జరిగాయి. లక్ష్మీ గణపతి హోమాన్ని అర్చక స్వాములు శాస్త్రోక్తంగా నిర్వహించగా, ఆలయ కమిటీ అధ్యక్షుడు చిట్టిబాబు పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు. అమ్మవారి ఉత్సవాల్లో సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు 64వ డివిజన్ కార్పొరేటర్ యరగొర్ల తిరుపతమ్మ, తదితరులు హాజరై అమ్మవారికి జరిగిన పూజా కార్యక్రమాల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

తెలుగు అధ్యాపకుడికి సత్కారం



మధురానగర్(విజయవాడసెంట్రల్): తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా భాషా సేవా రత్న పురస్కారం అందుకున్న సాంఘిక సంక్షేమ గురుకుల ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాల తెలుగు అధ్యాపకులు డాక్టర్ కానుకొల్లు బాలకృష్ణను గురువారం కళాశాలలో సత్కరించారు. ఈ సందర్భంగా తువ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పల్లూరు నీరజ మాట్లాడుతూ తుమ్మలపల్లివారి కళాక్షేత్రంలో అధికార భాషా సంఘం, తెలుగుభాషా ప్రాధికార సంస్థ సంయుక్తంగా నిర్వహించిన భాషా మహోత్సవాలలో 'భాషా సేవా రత్న' పురస్కారంతో సన్మానించడం కళాశాలకు గర్వకారణమని అన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు

3న బాలగోకులం పోటీలు

విజయవాడ కల్చరల్: సంస్కార భారతి విజయవాడ మహానగర్ శాఖ ఆధ్వర్యంలో శ్రీ కృష్ణ జన్మాష్టమి సందర్భంగా సెప్టెంబర్ 3వ తేదీ ఆదివారం ఉదయం సత్యనారాయణపురం శిశువిద్యామందిర్‌లో బాలగోకులం పేరుతో చిత్రలేఖనం, శ్రీకృష్ణవేషధారణ, భగవద్గీత పఠన పోటీలు నిర్వహిస్తున్నట్లు సంస్కార భారతి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పీవీఎస్ కృష్ణ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 10 సంవత్సరంలోపు బాల బాలికలకు శ్రీ కృష్ణవేషధారణ పోటీలు, 6వ తరగతి నుంచి 10వ తరగతి బాల బాలికలకు చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. 31వ తేదీ గురువారం సాయంత్రంలోపు 83747 60857 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు.

ప్రారంభానికి సిద్ధంగా పింక్ టాయిలెట్స్





విజయవాడ బెంజిసర్కిల్ సమీపంలో మహిళల కోసం ప్రత్యేకంగా పింక్ టాయిలెట్స్ నిర్మించారు. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన ఈ టాయిలెట్స్ ప్రారంభోత్సవానికి సిద్ధమయ్యాయి.
- కె. చక్రపాణి, సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ